# బందీ

సీతారామయ్య ఇంట్లో వెండి పళ్లెం పోయింది. ఇంటిల్లిపాదీ కంగారుగా తిరుగుతున్నారు. పోలీసు రిపోర్టు ఇవ్వాలనుకుంటున్నారు. అనుమానం వున్న వాళ్ల పేర్లన్నీ చెప్తున్నారు. జ్ఞాపకం వచ్చిన వాణ్ణల్లా అనుమానిస్తున్నారు.

'నాన్నా! నేను రిపోర్టు ఇచ్చి వస్తానే' అన్నాడు కొడుకు శేఖరం.

'నీ కివ్వాలనుంటే ఇచ్చిరా' అన్నాడు సీతారామయ్య. సొమ్ము పోయిందన్న ధ్యాసే లేకుండా, నిశ్చలంగా ఉన్న తండ్రినిచూసి శేఖరం ఆశ్చర్యపోయాడు.

'అదేమిటండీ, వందరూపాయల కంచం పోతే అట్లా అంటారూ' అంది సీతారామయ్య భార్య శాంతమ్మ.

'ఆ పళ్లెం మనది కాదే' అన్నాడు తాపీగా సీతారామయ్య.

సీతారామయ్యలో దొంగ దోచుకుపోతున్నా చూస్తూ ఉండటమనే తత్వం బయలుదేరి దాదాపు ఆరేళ్లయింది. ప్రపంచంలో 'నా' అన్న వస్తువేదీ లేకుండా చేసికోవాలని ఆయన అప్పట్నించీ ప్రయత్నంచేస్తూ ఇప్పటికి ఒక స్థితి చేరుకున్నాడు. ఆరేళ్ల క్రితం సీతారామయ్య భగవంతుణ్ణి గురించి ఆలోచించటం మొదలెట్టాడు.

దేవుడు దివ్యమంగళ మూర్తిగా తోచాడు. ఆ స్వామిది భువనమోహనమైనరూపం. మహాసౌందర్యాల మధుర సమ్మేళనం. ఆ రసధునిని సాకల్యంగా సందర్శించాలని పడే వేదన మధుకీల. ఆ జ్వాలలో వేగిపోవటం మొదలెట్టాడు సీతారామయ్య.

సీతారామయ్యకు ఈ ప్రపంచంలోని ప్రతి సౌందర్యంలోనూ ప్రతి 'మంచి' లోనూ భగవంతుడి ఛాయ తోచేది. ప్రతి మనిషి చాలా అందంగా కన్పించే

సత్యం శంకరమంచి

వాడు. సర్వుల్నీ ఆప్యాయంగా సమానంగా ప్రేమించటం మొదలెట్టాడు. 'నా భార్య' 'నా కొడుకు' అన్న భావం సీతారామయ్యని కొంతకాలం బాధించింది. తనవాళ్లయందున్న ఈ పాక్షికమైన దృష్టి భగవత్సౌందర్యాన్ని ఆవిష్కరించుకోటానికి ఆటంకంలా కన్పించింది. ఈ అడ్డు తొలగించుకోటానికి సాధనచేశాడు.

ఒకసారి శాంతమ్మకు జబ్బుచేసింది. కొంచెం తీవ్రమైన జబ్బే. శేఖరం మందులవీ తీసికొచ్చేవాడు. అప్పుడప్పుడు సీతారామయ్య భార్య మంచం పక్కన కూర్చుని పలకరించేవాడు. భార్య నీరసంగా సీతారామయ్యవైపు చూసేది. ఆమె కళ్ళలో నీళ్లు తిరిగేవి.

'ఎందుకు కన్నీళ్లు? ఇంతకాలం సుఖం అనుభవించావు. ఇప్పుడు బాధ వస్తే కష్టపడ్తే ఎట్లా? ఆ బాధగూడా అంత తేలిగ్గా అనుభవించేయాలి' అనే వాడు సీతారామయ్య.

సీతారామయ్యకు తన ఇల్లు చిన్న సత్రంలా కన్పిస్తూంది. భార్య, కొడుకు, కోడలు అంతా దారినపోతూ, కొంచెం సేపు విశ్రాంతి తీసుకోడానికి వచ్చిన మనుషుల్లా ఉన్నారు. కొందరు ముందు వచ్చారు. కొందరు తర్వాత వచ్చారు. అట్లాగే కొందరు ముందు కొందరు తర్వాత వెళ్తారు. ఈ సత్రంలో కలిగిన తాత్కాలిక పరిచయాలు ముందు చేయవలసిన ప్రయాణానికి, చేరవలసిన గమ్యానికి ఆటంకాలు కాకూడ దనుకున్నాడు సీతారామయ్య.

'అబ్బ! ఎంత బావుంది! నా మార్గం ఎంత సుగమమైంది! నా కీనాటికి విముక్తి కలిగించావా భగవన్' అనుకున్నాడు సీతారామయ్య.

* * *

శేఖరంభార్య మొగపిల్లవాణ్ణి కన్నది. శాంతమ్మ సీతారామయ్య గదిలోకి పరుగెత్తుకొచ్చి చెప్పింది 'మీకు మనవడు పుట్టాడండీ.'

'సత్రంలోకి కొత్త మనిషొచ్చాడా? ఏ వూరుట?' అన్నాడు సీతారామయ్య.

శాంతమ్మ తెల్లబోయింది. భర్త అంటున్నదేమిటో అర్థంకాలేదు.

'కోడలికి కొడుకండీ. మీకు మనవడు పుట్టాడు' అంది.


'ఆహా!....అట్లాగా!' సంతోషం నటిస్తూ అన్నాడు సీతారామయ్య.

మనవడు కల్గాడన్న వార్త సీతారామయ్యకు పెద్ద ఆనందాన్ని కలిగించలేదు. ఆ వార్త చెబుతున్నప్పుడు శాంతమ్మ కళ్లలో కదిలే వెలుగు అతన్ని ఆశ్చర్యపరచింది.

'రండి. మనవణ్ణి చూద్దురుగాని' అంది శాంతమ్మ.

'పద' అన్నాడు సీతారామయ్య భార్య సంబరపు పొంగుకు నవ్వుకుంటూ.

కళ్లు తెరవని మనవణ్ణి పొత్తిళ్లతో చూపించింది శాంతమ్మ. ఆ పసిపాప మిసిమిచూసి సీతారామయ్య మనస్సు చెదిరిపోయింది. పాప 'కేరు' మన్నాడు. సీతారామయ్యకు దేవదూత పిలిచినట్లుంది. స్వర్గ ద్వారాలు తెరిచే తాళపు చెవులు తన నునులేత వేళ్ల గుప్పిట్లో బిగించి భద్రంగా తీసికొచ్చి అందిస్తున్నట్లుగా, పాప తన గుప్పిటను సీతారామయ్యవైపు సాచాడు. సీతారామయ్య చలించిపోయాడు. కళ్లు చెమ్మగిల్లినై, భార్య చేతుల్లోంచి పాపను తన చేతుల్లోకి తీసుకున్నాడు. పాప పాలబుగ్గలు ముద్దు పెట్టుకున్నాడు. పాప 'కేరు' మన్నాడు. ఆ స్వరంలో తను తరించే మంత్ర మేదో మోగినట్లనిపించింది. మళ్లీ ముద్దు పెట్టుకున్నాడు. పాప మళ్లీ కేరు మన్నాడు. మళ్లీ ముద్దు పెట్టుకోబోతుంటే శాంతమ్మ ఆపి 'పాలకోసం ఏడుస్తున్నాడు' అని పాపని తన చేతుల్లోకి తీసికుంది. శాంతమ్మ ముఖంలో వెలుగు నృత్యం చేస్తోంది. పక్కనే కొడుకు, కోడలు చూట్టానికి వచ్చిన కొందరు ఆడవాళ్లు ఉన్నారు. సీతారామయ్య వీళ్ల నింతవరకు గమనించనే లేదు. చూడవచ్చినవారు 'అచ్చు తాత పోలికే' అంటున్నారు. సీతారామయ్య



ఆ రహస్య మేదో నాకూ వినపట్టంలేదు.

ధీమాగా అంగలేసుకుంటూ గది బయటికి వచ్చేశాడు.

సీతారామయ్యకు పాత అనుభూతులు పునరావృత్తం అవుతున్నాయి. బాబు నవ్విన బోసినవ్వులు, వేసిన తప్పటడుగులు, వచ్చీ రాని పిలుపులు సీతారామయ్యలో చెరగని ముద్రలు వేస్తున్నాయి. ఎప్పుడూ మనవణ్ణి గురించే ఆలోచించేవాడు. శేఖరం పుట్టినప్పుడు కూడా తనింత ఆనందాతిరేకాన్ని అనుభవించలేదు. అప్పట్లో సంసారభారం తెరిపినిచ్చేది కాదు.

బాబుకి మూడేళ్లు నిండుతున్నాయి. సీతారామయ్య పారాయణ చేసు

కొంటుంటే బాబు పక్కనించి పోతూ 'ఫెడీ' మని ఆ పుస్తకాన్ని కింద పడ గొట్టి వెళ్లేవాడు. సీతారామయ్య పరుగెతు తున్న బాబుని చూస్తూ, నవ్వుకుంటూ కిందపడ్డ పారాయణ పుస్తకాన్ని తీసి కొనేవాడు. బాబుమీద ఈగ వాలనిచ్చే వాడు కాదు సీతారామయ్య. బాబు ఒక రోజు గాజుగ్లాసు పగలగొట్టాడని వాళ్లమ్మ రెండు చరిచింది. ఆ రోజు సీతారామయ్య అన్నం మానేశాడు.

బాబు వాకిట్లోనుంచి పెద్దగా ఏడుస్తూ వచ్చాడు.

'తాతయ్యా! వాళ్ల బాచిగాడు నన్ను సైకిలు ఎక్కనీటంలా. నాక్కూడా అట్టాంటి మూడుకాళ్ల సైకిలు కొని పెట్టవా....' అంటూ సీతారామయ్య ఒళ్లో దూకాడు.

'కొనిపెడ్తాలే....ఏడవకు' అన్నాడు సీతారామయ్య.

'ఇప్పుడే....ఇప్పుడేకావాలి ఈ....' అన్నాడు బాబు గునుస్తూ.

'ఆ....ఆ! ఇప్పుడే కొనుక్కొస్తా ఏడవకు మరి....మా నాన్న గదూ' అని 'ఏమేవ్' అని భార్యని కేకేసి 'నీ దగ్గిర డబ్బేమైనా ఉందా?' అడిగాడు సీతా రామయ్య.

శాంతమ్మ ఆశ్చర్యపోయింది. సీతా రామయ్య గత ఏడెనిమిదేళ్లలో ఇదే డబ్బు ప్రసక్తి తేవటం.

'ఎంత?'

'ఎంతుంది?'

'ముప్పై'.

'పట్రా'

ఆ డబ్బు తీసికొని, చొక్కా తగి లించుకొని ఉత్తరీయం వేసుకోకుండా వీధిలో పడ్డాడు.

'ఇదిగో! షావుకారూ! ఈ మూడ చక్రాల సైకిలిచ్చెయ్యవయ్యా'.

'అది అమ్ముడుపోయిందండి. మా దగ్గిర ఒకటే వుంది. నిన్న రంగయ్య గారు వాళ్ళ మనవడికి తీసికొంటా నని చెప్పివెళ్ళారు. ఇంకో పదిరోజుల్లో స్టాకు వస్తుంది. అప్పుడురండి.'

'అదేం కుదర్దు. కావాలంటే ఇంకో రెండు రూపాయలు ఎక్కువిస్తాను తీసుకో....రంగయ్యగారికి చెప్పవయ్యా ఇంకో పదిరోజుల్లో స్టాకు వస్తుంది; అప్పుడు తీసుకోమని.'

సైకిలు పట్టించుకొస్తూ సీతారామయ్య ఆలోచిస్తున్నాడు. ఏమిటి చిత్రం! తనెంతమారిపోయాడు! మనవడంటె ఎందుకింత ప్రత్యేకమైన ఆపేక్ష! నాకు తెలియని సంకెళ్లు ఇంకా ఎన్ని బిగిం చావు తండ్రీ?' అనుకున్నాడు ఆకాశం వైపు చూస్తూ. ★